# గీతాగోవిందం

- నందచైతన్య

మరీ ఇంతలా నేను లొంగిపోతానని ఎప్పుడూ ఊహించలేదు. కావ్యాల్లోని కొన గంటి చూపులూ, సినిమాల్లోని లవ్ ఎట్ ఫస్ట్ సైటులూ, వీటిని వేటినీ నమ్మకుండా ఉండేవాడిని. ప్రేమ అనే మాటనే తృణీకరించేవాడిని.

ఎందుకిలా చిక్కుకుపోయాను ఆమె వలలో.

వల అంటే కంటికి కనిపించని వల. మనసును మత్తులో ముంచేసే వల.

కళ్ళు మూసుకుంటే కంటి ముందు ఆమె రూపం, ఆమె నవ్వు, మొహాన మెరిసే కళా, కళ్లల్లో విరబూసే నిర్మలత్వం- ఏ నటనా, ఏ భేషజమూ, ఏ వ్యామోహమూ లేని ఆమె-

ఇంతలా నను ఉక్కిరిబిక్కిరి చేసి ఊగించి ఉత్సాతాలు సృష్టిస్తుందని తెలిసి ఉంటే ఆమెవైపు చూడక పోయే ఉందును. ఇంత గందరగోళం ఈ ఆకర్షణలో ఉందంటే ఆమెతో మాట్లాడకపోయే వుందును. అసలా తిరుపతే వెళ్ళకపోయి ఉందును? వెళ్లినా ఆ మెట్లదారిలో అసలు నడిచి వెళ్లాలనే ఊహనే రాని వ్వకపోయి ఉందును.

అయినా ఇప్పుడనుకుని ఏం లాభం?

ఆ మధు, భారతీలను అనాలి.

"రాను మొర్రో" అంటూ వుంటే "నువ్వు రాకపోతే ఎలా కుదురుతుంది? నీ కోసమే మేం మొక్కు కున్నాం" అన్నారు.

"నువ్వు ఫోటోలు తీస్తేనే, తీస్తానంటేనే భారతి బయల్దేరతానంటుంది" అన్నాడు మధు.

అనవసరంగా ఫోటోగ్రఫీ నేర్చుకున్నానా అనిస్తోం దిప్పుడు.

తిరుపతి వెళ్లొచ్చేసేది ఏ బస్సెక్కో వెళ్లి వచ్చేసినా బావుండేది. నడిచి మెట్లెక్కుతామని మొక్కుకున్నారట. ఆ నడిచి వెళ్లడంలోనే వచ్చింది చిక్కంతా.

గీతకు చిక్కుకున్నది ఆ మెట్లమీదనే కదా!

దైవ నిర్ణయాన్ని ఎవరు తప్పించగలరు స్వామీ!

గీత-విధివ్రాత- ఏమౌతుందో చివరికి!

***

డిగ్రీ పూర్తయ్యేసరికి ఇంటి పరిస్థితులు తారుమార య్యాయి.

నాన్నగారు డ్యూటీలో వుండగా చనిపోవడంతో ఆ ఉద్యోగం అన్నయ్యకొచ్చింది. ఉద్యోగం సాధించిన అన్నయ్యే ప్రేమలో పడ్డాడో, ఉద్యోగస్థుడైన అన్నయ్యను వదినమ్మే ప్రేమలోకి లాగేసిందో కిరణ్మయి అనబడే డాక్టరు (అప్పటికింకా డాక్టరు కాలేదు) పెద్ద వదినగా మా ఇంట్లోకి అడుగుపెట్టింది.

ఆడవాళ్ళకి వంట ఇంటిమీద వుండే కోరిక వల్లే ఇళ్లల్లో యుద్ధాలు జరుగుతాయి అనుకోవచ్చు. 'నా చేతి వంట తిని పెరిగాడే వాడు' అని అన్నయ్య కోసం అమ్మ వండి పెట్టబోతే, 'ఆయనకు కొలెస్ట్రాల్ పెరిగిపోద్ది. ప్రమాదం' అంటూ వదిన వప్పుకునేది కాదు. అది యుద్ధారంభం.

తల్లీ పెళ్లాల మధ్య నలిగిపోయాడు అన్నయ్య.

వారి యుద్ధానికి ప్రత్యక్ష సాక్షిగా నేను. డిగ్రీ అయ్యాక ఖాళీగా ఇంట్లో ఉండడం ఇష్టం లేక, ఇంట్లో రభస నిత్యం భరించలేక కూడా ఓ



కేబుల్ సంస్థలో అసిస్టెంట్ మెకానిక్‌గా జాయిన య్యాను.

ఇంటికి వెళ్లాలనే శ్రద్ధ తగ్గిపోవడంతో పనిలో ఎక్కువ కూరుకుపోయేవాణ్ని. పని-పని-పని!

పనిలో ఆనందం దొరికేది. డబ్బులు వచ్చేవి. స్నేహితులు చేరేవారు. ఆనందం... ఆనందం కోసం అర్ధరాత్రి వరకూ సిన్మాలు.

తెలిసిన స్నేహితుడెవరో పిజీకోసం వైజాగ్ వెళ్తు న్నాడని తెల్సి నేను పీజీ చేస్తానని ప్రకటించాను ఇంట్లో.

అన్నయ్య "ఏదో ఉద్యోగం వెలగబెట్టక ఇంకా ఎందుకురా చదువు?" అన్నాడు.

"దేశంలో నిరుద్యోగుల సంఖ్య పెంచడానికి" అంటూ తానేదో గొప్పగా జోక్ చేశానని అనుకుని నవ్వేసింది వదిన. నాలో కసి పెరిగింది.

ఆ రోజే వైజాగ్ వెళ్లిపోవాలని నిశ్చయించుకుని అమ్మతో చెప్పి రైలెక్కేశాను. వైజాగ్‌లో చినబావ ఇంట్లో మకాం. చినబావో చిరుద్యోగి. తనకు భారంగా ఉండటం ఇష్టంలేక పీజీ చదువు కోరికను పక్కనపెట్టి ఓ ప్రొఫెషనల్ ఫోటోగ్రాఫర్ దగ్గర అసిస్టెంట్‌గా చేరాను.

సాయంత్రం స్టూడియో కట్టేసిన తరువాత కంప్యూటర్ సెంటర్లో కాసేపు విద్యాభ్యాసం చేసి రాత్రికి ఇంటికి చేరుకోడం, ఉదయం పని, రాత్రికి కంప్యూటర్ సెంటర్‌లో చదువు.

జీవితం ఏ మూలకి విసిరివేయబడుతుందో తెలీకముందే అమ్మ ఓ రోజున విజయవాడ నుండి ఊడిపడింది 'నేనింక పెద్దోడి దగ్గర ఉండలేనం'టూ.

చిన్నక్కా, చినబావా అమ్మను ఆదరించారు.

నాకిప్పటికీ అదే ఆశ్చర్యం... చిరుద్యోగస్థులైన చిన్నక్కా, చినబావ మమ్మల్ని ఆదరించ గలిగినప్పుడు రైల్వేలో ఐదంకెలు జీతాన్ని సంపాదించే అన్నయ్య, అదే స్థాయిలో సంపాదన కలిగిన డాక్టరు వదినమ్మ అమ్మను ఎందుకు ఆదరించలేకపో యారు?

మనుషుల లోపల మరో మనిషిని వెతికే ప్రయత్నం నాలో ఆ 'ప్రశ్న'తోనే ప్రారంభమయ్యేది. ఇంతలో చిన్న సంఘటన నా జీ

తాన్ని మరో మలుపు తిప్పేసింది. ఆ రోజు ఫోటోలు తీసి మా ఓనరుకు నెగెటివ్‌లు అప్పగించాలని బయల్దేరాను. ఇప్పుడు స్టూడియో నా చేతుల మీదే రన్ అవుతోంది. మా ఓనరు బాధ్యతంతా నాపైన వేసేసి ఇంటికి వెళ్లి పెళ్లాంతో కబుర్లాడుకుంటాడు. రాత్రికి వచ్చిన ఎమౌంటూ, ఖర్చులూ, బండీ అన్నీ అప్పజెప్పేసి బస్టాండుకు వచ్చి బస్సెక్కేయడం నా డ్యూటీ. 'నీకో బండి కొనాలయ్యా' అంటాడుగానీ కొనడు.

'మన గోవిందు భలే కష్టపడతాడులే. గోవిందు తీసినంత క్లారిటీతో నేను కూడా తీయలేనేమో' అని భార్య ముందు పొగుడుతాడుగానీ జీతం మరో వంద పెంచడు.

వేగంగా బండిమీద వస్తున్న నేను పక్క సందులో నుండి దూసుకువచ్చే కారును చూసుకోలేకపోయాను. బండికి ఢీ... నా తల వెళ్లి ఫుట్‌పాత్ అంచుకు తగిలి నేను కోమాలోకి.

***

మెలకువ వచ్చేసరికి ఎదురుగా ఎవరూ లేరు. బహుశా నా జేబులో విజిటింగ్ కార్డు చూసి మా ఓనరుకి ఫోన్ చేస్తే ఆయనే నన్ను హాస్పిటల్‌లో జాయిన్ చేశారేమోనని నా ఊహ.

నాకు కుడివైపు మా ఓనరు గొంతు విన్పించింది.

"నేనంత ఎలా భరించగలనండీ. ఏదో వందో, ఐదువందలో సర్దగలనుగానీ" అంటూ.

"ఆ అయిదువందలూ వందా కూడా వద్దులెండి. మేం పెట్టుకోగలం" చిన్నబావ గొంతు కాస్త గట్టిగా.



నా కంటి చివర ఆ రోజు రెండు కన్నీటి బొట్లు నిలిచాయి.

'ఒరే వెర్రి గోవిందూ! వాళ్లొంచి నువ్వెంత కష్టపడితే నీ ఓనరు ఇంత స్థాయికి చేరుకున్నాడు. నీ ఓనరు కోసం నువ్వెన్ని అవసరాలు వదిలేసుకున్నావు? ఇప్పుడు చూడు నీ కోసం ఓ ఐదువేలు అప్పివ్వడానికి వాడెంతలా గిజగిజలాడుతున్నాడో?' నా మనసు లోపల్నుండి ఆ మాటలు విన్పించాయి.

చిన్నక్కే అప్పు తెచ్చింది.

పెద్దన్నయ్యా వాళ్ళ పిల్లలకి పరీక్షలట.

పరీక్షలయ్యాక చూడ్డానికి వస్తానని ఫోన్‌లో చెప్పాడట. మనుషులమీద నమ్మకం మరింతగా తగ్గిపోయింది.

***

నేను 'మనిషి' అనే పదార్థాన్ని నమ్మకుండా పోదునేమో! మధు, భారతీ కన్పించకపోతే!

ఆ హాస్పిటల్లో ఎంత సేవ చేసారు వాళ్లిద్దరూ. అమ్మ దిగులుతో మంచం పట్టేసింది. ఆమెకు సపర్యలు చేస్తూ చిన్నక్కా, బావ వుంటే- వాళ్లిద్దరే... భారతి అమ్మలా ముద్దలు చేసిపెట్టింది నోటికి. మధు నాన్నలా నను బాత్రూంకి నడిపించి తీసుకువెళ్లేవాడు. నా జీవితంలో కాస్త రిలాక్సేషను నేను వాళ్లతో వున్నప్పుడే పొందానేమో!

ఇదేమిటీ, ఎక్కడో ప్రేమా వలా అంటూ మొదలుపెట్టి ఈ 'సిన్మా కథ' చెబుతాడేమిటీ అనుకోకండి.

అప్పుడలా మంచం మీద వున్న నాకు నయమైతే తిరుపతి కొండకు మెట్లెక్కి నడిచి వస్తామని మొక్కుకున్నారట ఆ ఇద్దరూ...నాతో సహా!

ఆ తంతాయే ఇదంతా!

ఇంతకీ మెట్లమీదేమయ్యిందంటే...

ముగ్గురం హుషారుగా మెట్లెక్కేస్తున్నాం. ఓ నలభై యేళ్లావిడ తన ఇద్దరు కూతుళ్ళనుకొంటా వాళ్లతో కబుర్లు చెబుతూ నడుస్తోంది.

మమ్మల్ని దాటేసారు వాళ్ళు.


ఒకమ్మాయి వయసు ఇరవై రెండూ ఇరవై మూడూ మధ్య వుంటుంది.

మరొకమ్మాయి వయసు పన్నెండూ పదమూడేళ్ళు వుండొచ్చు.

"గోవిందూ! ఆ అమ్మాయిని చూడు. నచ్చితే పైన కళ్యాణ మండపంలోనే పెళ్లి చేసుకోవచ్చు" అంది భారతి. కొండమీద నుండి గంటల శబ్దం విన్పించింది. ఉలిక్కిపడ్డాను నేను.

ఎందుకంటే... నా మనసులో పెళ్లి అనే మాటకు చోటివ్వకూడదనుకొనే నేను ఆ అమ్మాయినే ఇందాకట్నుండీ అబ్జర్వ్ చేస్తున్నాను.

ఆ అమ్మాయి నడకలో ఓ హుందాతనం వుంది. ఆ అమ్మాయి నవ్వులో నిర్మలత్వం వుంది. ఆ స్వచ్ఛతను వర్ణించలేం. కొండకోనల్లోంచి పారుతూ వస్తున్న సెలయేటి నీటి స్వచ్ఛత అది. తొలి మంచు బిందువు తాకిడికి అరవిస్తోన్న పుష్పం ప్రకృతి



## సెక్సీ హీరో

కొంతమంది తారల ప్రవర్తన, వస్త్రధారణ తోటి తారల్ని ప్రభావితం చేస్తుంది. 'ఇండస్ట్రీలో సెక్సీ హీరో ఎవరు?' అని సెలీనాని అడిగితే బిగ్ బి అమితాబ్ అని బదులిచ్చింది. 'వయసు పెరుగుతున్న ఆయన అందంలో మార్పుకనిపించడం లేదంటోందామె. ఆయన రూపం, మాటలు నన్నెంతో ఉద్వేగానికి గురి చేస్తాయి. ఆయనతో కలిసి ఓ సినిమాలో నటించాలని ఉంది' అని తన అంతరంగాన్ని విప్పిచెబుతోంది సెలీనా. సినిమాల్లో ఛాన్స్‌ల కోసం ఆమె సెక్సీగా తయారవుతోంది. మోడలింగ్ రంగం నుంచి బాలీవుడ్‌కి వచ్చిన సెలీనాకి ఇది కొట్టిన పిండే అంటున్నారంతా. నిజమేనేమో!

మాతకు చేస్తున్న వందనంలోని స్వచ్ఛత అది.

ఆకాశంలో ఎగిరి వెళ్లిపోయే తెల్లని మబ్బుల్లోని స్వచ్ఛత అది. స్వచ్ఛత, ఏ రకమైన వ్యామోహాన్ని, మోహ వికారాన్ని పుట్టించని నిండైన స్వచ్ఛత.

"ఎక్స్‌క్యూజ్‌మీ! ఓ ఫోటో తీస్తారా" ఆ పెద్దావిడ కెమెరా చాపుతూ అంటోంది.

మా మధు అందుకోబోతుంటే "మీరెందుకూ? గోవిందు తీస్తాడులే" అంటోంది భారతి.

కెమెరా తీసుకోక తప్పలేదు.

ఆ మెట్లమీద నిలబడి నా ఎదురుగా వాళ్లమ్మా, ఆమె, ఆమె చెల్లీ... ఎన్నో వేల ఫోటోలు తీసిన నేను ఆ క్షణంలో తడబడ్డానేమో అన్పించింది.

"ఫోటో క్లిక్ కావడంలేదు. రీల్ స్టక్కయ్యింది" అన్నాను నేను కెమెరా పరిశీలించి.

"అయ్యో" అందామె. ఆమె గొంతులోనూ అదే స్వచ్ఛత.

"ఇక్కడ సీనరీ చాలా బావుంది. ఫోటో వచ్చుంటే బావుణ్ణేమో" అంటోందా అమ్మాయి.

మా భారతి చొచ్చుకుపోయింది.

"ఏం ఫర్వాలేదాంటీ. మా దగ్గర కెమెరా వుంది" అని "ఫోటో తియ్యి గోవిందూ" అంటూ నాకు ఆర్డ రేసింది.

"మరి మాకు ఈ ఫోటో..."

"తర్వాత మీ అడ్రస్ ఇవ్వండి. పంపించివేస్తాం" భారతి హామీలిస్తోంది. ఆడపిల్లలు చాలా వేగం గానూ కల్సిపోగలరు. వేగంగానూ విడిపోగలరు. ఎవరెక్కడ కలుస్తారో, ఏ క్షణాన విడిపోతారో!

వాళ్లతో మా భారతి కలసిపోయింది. మమ్మల్నీ వాళ్లతో కలిపేసింది.


నేను నడుస్తూ వాళ్లకు నచ్చినచోట ఆగి ఫోటోలు తీస్తూనే వున్నాను. మెట్ల దారి. అలుపు తెలియనీయలేదు. దైవ మహత్యమో... కాక...

తిరుపతిలో అంతా కలిసే తిరిగాం. వాళ్లకూ మాకూ విడిది వేరు వేరుగా ఏర్పాటైనా రాత్రిళ్ళు నిద్రపోవడానికి తప్ప మిగిలిన సమయాల్లో కలిసే ఉన్నాం. ఆమె పేరు తెలిసింది ఆ పరిచయంలోనే- గీతట.

బలమైన సంఘటనలు... హత్తుకుపోయే, అల్లుకుపోయే సినిమా సన్నివేశాలేం జరగలేదుగానీ...

ఆ తల్లీకూతుళ్ళ మధ్య ప్రేమ, వాళ్ళ ఆప్యాయత నిండిన మాటలు...

మరీ ముఖ్యంగా గీత నవ్వు- నీ నిర్మల దరహాసంలో చెలీ! సేద తీరగలనులే వేల వేల సంవత్సరాల వ్యధల నుండి, హృదయాన్ని ఛిన్నాభిన్నం చేసేసే అనుభవాల బాధల నుండీ-




ఎందుకింత ఆకర్షణ... అని అనకండి.

ఇది ఖచ్చితంగా ఆకర్షణ కాదు.

నిత్య యాంత్రిక జీవనంలో వేనవేల ముసుగు మనుష్యుల్ని చూసాను, ఆ ముసుగు వీళ్ళకు లేదు. అవసరాలకోసం మేకప్ నవ్వుల పూతలు పూసుకునేవాళ్ళని చూసాను. వీళ్ల నవ్వులో ఆ మేకప్ లేదు.

వాళ్ళను స్టేషన్‌లో బండెక్కిస్తుంటే ఎందుకో గుండె బరువుగా అన్పించింది.

"మూడురోజుల పరిచయానికే నేనింతగా బందీ అయిపోయానేమిటి?" అన్పించింది నాకు.

బండి ఇంకా కదల్లేదు.

అటూ ఇటూ చూసాను. దూరంగా లేడీస్ హేండ్ బ్యాగుల షాపు కన్పించింది. గబగబా అటు వెళ్లాను. నచ్చిన బ్యాగు ఒకటి తీసుకుని గీతకు ఇచ్చాను. "ఎందుకండీ" అందామె.

"చిన్న గిఫ్ట్‌గా" అన్నాను నేను.

"అభిమానం మనసులో ఉంటే చాలు"

"ఎప్పటికీ నా మనసులోనే నీవు" అనుకున్నాను నాలో నేను.

"మీరు వెళ్ళిపోయినా మా దగ్గరే ఉంటారులే" అంది భారతి.

ఆశ్చర్యంగా చూసింది గీత. వాళ్ళమ్మగారిదీ అదే పరిస్థితి. నవ్వేస్తూ అంది భారతి.

"మీ ఫోటోలు మా దగ్గరే ఉంటాయిగా" నవ్వేసిందామె. గలగలా నవ్వింది గీత.

కలలా...అలలా...'వల'లా

* * *

"నీకేంరా నెలకు ఐదువేలు సంపాదిస్తున్నావ్‌గా. నీకు నచ్చిన అమ్మాయినే చేసుకో" అంది అమ్మ.

చిన్నక్కా బావా సరేసరి. "ఇప్పుడే వెళ్ళి మాట్లాడదామా" అన్నారు ఆ అర్ధరాత్రి నాకు నిద్రరావడం లేదని వాళ్లని లేపి నా కథ చెప్పేసరికి.

* * *

అందరం హైదరాబాద్ బయల్దేరాం.

తాళం వెయ్యబోతుంటే ఫోన్. నాకెందుకో అది 'గీత' దగ్గర్నుండే అన్పించింది.

ఈమధ్యకాలంలో ఏ ఫోన్ మ్రోగినా అదే భావం. అంత 'మందు' ఏం పెట్టిందో మరి?

"హలో?" అన్నాను.

"గోవిందు గారున్నారా?" గీత గొంతు అట్నుంచి.

రిసీవర్ మీద నా చేతిపట్టు బిగుసుకుంది.

"మీతో ఓ విషయం మాట్లాడాలి"

"..."

"మీకు నేను నచ్చితే పెళ్ళి విషయం మీతో..."

ఆమె గొంతులో సన్నని ప్రకంపనం.

గోవిందు అనబడే నేను అపుడు చాలా గట్టిగా అరిచానట. ఎన్నో కథల్లో చివర్లో చెప్పేటట్టు అది కల కాదట.

★